www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -7 సోమవారం 7 ఏప్రిల్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కంచె గచ్చిబౌలిని శాశ్వతంగా కాపాడుకుందాం

విద్యార్థులకు, పర్యావరణ ప్రేమికులకు, ప్రజలకు కెటిఆర్ బహిరంగ లేఖ

హెచ్‌సియు విద్యార్థుల పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వం అపవాదులు

విద్యార్థుల పోరాటాన్ని తక్కువ చేసి చూపించే కుట్ర

యూనివర్సిటీ తరలింపు, ఏకో పార్క్ అంటూ చేస్తున్న కుట్రలపై మండిపాటు

నిస్వార్థంగా చేసే ఉద్యమాలు ఎప్పుడూ విజయం సాధిస్తాయి



**హైదరాబాద్ ప్రజావినికిడి,:** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విద్యార్థులకు, పర్యావరణ కార్యకర్తలకు, ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేసిన అద్భుతమైన పోరాటంపై కాంగ్రెస్ ప్రభుత్వం అపవాదులు వేస్తూ, బెదిరింపులకు దిగుతున్నదని ఆరోపించారు. హెచ్‌సియు విద్యార్థులు 400 ఎకరాల కంచె గచ్చిబౌలి అడవిని కాపాడేందుకు నిస్వార్థంగా, ఉదాత్తమైన లక్ష్యాలతో చేపట్టిన ఆందోళన అద్భుతం అని కొనియాడారు. పర్యావరణం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటానికి కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల పోరాటాన్ని తక్కువ చేసి చూపాలన్న కుట్రతో అనేక అపవాదులు వేస్తున్నదని పేర్కొన్నారు. **మిగతాది 2లో...**

## సన్నబియ్యం పంపిణీ పథకంతో పేదవారి కళ్లలో ఆనందం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

భద్రాద్రి జిల్లా లోని గిరిజన లబ్ధిదారు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం

ఆ కుటుంబానికి కొత్తవస్త్రాల అందజేత

సీఎంతో పాటు భట్టి , తుమ్మల, పొంగులేటి



**బూర్గంపాడు,, ఏప్రిల్ 06 ప్రజావినికిడి,:**

రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ పథకంతో పేదవారి కళ్లలో ఆనందం చూశానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదవాడి ఇంట్లో సన్నబియ్యంతో అన్నం రుచిని స్వయంగా చూడడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, 80 శాతానికి పైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మపేటకు చెందిన ఆదివాసీ కుటుంబం, సన్నబియ్యం లబ్ధిదారు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి.. **మిగతాది 2లో...**

## సాంకేతికత-సంప్రదాయాల సమ్మేళనం



### పాంబన్ వంతెనను ప్రారంభించిన మోదీ..

- తమిళంలో సంతకం చేయరేం?
- ఇదేనా..మీ భాషాభిమానం?
- ఎంబిబిఎస్ వంటి వైద్యవిద్య
- కోర్సుల్లో తమిళ భాషను
- ప్రవేశపెట్టి ప్రోత్సహించాలి
- స్టాలిన్ సహా డిఎంకె నేతలపై
- ప్రధాని నరేంద్ర మోడీ విసుర్లు
- తమిళనాడు సీఎం గైర్హాజరు

**చెన్నై, ఏప్రిల్ 06ప్రజావినికిడి,:**

: తమిళనాడు అభివృద్ధికి కేంద్రం ఎంతో చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. అయినా అకారణంగా ఏడవడం కొందరికి అలవాటుగా మారిందని విమర్శించారు. 'వారు ఏడుస్తూనే ఉంటారు. మనమేమీ చేయలేం' అని తమిళనాడు సీఎం స్టాలిన్ అండ్‌కోపై ధ్వజమెత్తారు. అలాగే తనకు ఎంతో మంది తమిళనాడు నేతలు లేఖలు రాస్తుంటారని.. ఒక్కరు కూడా తమిళంలో సంతకం చేయడం లేదని ఆక్షేపించారు. శ్రీలంక పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం వాయుసేనకు చెందిన ప్రత్యేక హెలికాప్టర్‌లో నేరుగా రామనాథపురం జిల్లా



మండపం వచ్చిన ప్రధాని.. పాంబన్ సముద్ర వంతెనను లాంఛనంగా ప్రారంభించారు. వంతెన పై నుంచి రైలుకు, కింది నుంచి నౌకా రవాణాకు కూడా పచ్చజెండా ఊపారు. అంతేగాక రాష్ట్రంలో రూ.8,300 కోట్ల విలువైన వివిధ రైలు, రోడ్డు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మిగతా 2లో..



## కమనీయంగా

### భద్రాచలంలో సీతారాముల కల్యాణం...

పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

సతీసమేతంగా భద్రాద్రికి తరలివచ్చిన సీఎం రేవంత్ రెడ్డి

రామ నామ స్మరణతో మార్మోగిన భద్రాద్రి

తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు

## జలవివాదంపై గట్టి వాదనలు

నీటి వాటాలపై ఏపీతో గట్టిగా తేల్చుకునేందుకు సిద్ధమైన తెలంగాణ

సుదీర్ఘకాలంగా తెలంగాణ, ఏపీ మధ్య నీటి వాటాలపై వివాదం

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ భేటీ

అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ




2లో

## అమెరికాతో మాట్లాడండి

### రొయ్యలకు సుంకం మినహాయించేలా చూడండి

- 27% దిగుమతి సుంకంతో ఆక్వాకు నష్టం
- ఆక్వా రైతాంగానికి అండగా నిలవాలి
- ఏపీ జీడీపీలో మత్స్యరంగం కీలకం
- కేంద్ర మంత్రి గోయల్‌కు సీఎం బాబు లేఖ





**అమరావతి, ఏప్రిల్ 06 ప్రజావినికిడి,:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధానికి తెరలేపడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు మొదలయ్యాయి. ఎక్కడో ఉన్న ట్రంప్ విధించిన సుంకాల కారణంగా ఇక్కడ ఏపీలోని ఆక్వారంగం కూడా ప్రభావితమవుతోంది. దీనిపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన నేడు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు లేఖ రాశారు.భారత్‌పై అమెరికా 27 శాతం సుంకం విధింపు కారణంగా దేశీయ ఆక్వా రైతులు నష్టపోతున్నారని తన లేఖలో పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం విధిస్తున్న అధిక సుంకాలను తగ్గించాలని,



తద్వారా ఆక్వా ఉత్పత్తులకు మినహాయింపు కల్పించాలని ఆయన ఆ లేఖలో కోరారు. అధిక టారిఫ్ ల వల్ల మన ఆర్డర్లను ఇతర దేశాలు రద్దు చేసుకుంటున్నాయని, దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేయడానికి కూడా స్థలం లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర జీడీపీలో మత్స్యరంగం ఒక ముఖ్యమైన భాగమని గుర్తు చేస్తూ, ఈ సంక్షోభ సమయంలో ఆక్వా రైతులకు అండగా ఉండాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. ఆక్వా రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చిన చంద్రబాబు, ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు, రేపు అల్లూరి జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన



**పాడేరు/అమరావతి,ప్రజావినికిడి,:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమ, మంగళవారాలు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో పర్యటించనున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 8గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగుడ మండలం చాపరాయికి 11గంటలకు చేరుకుంటారు. దీనికి అవతల వైపున సుమారు 3కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదపాడు గ్రామాన్ని సందర్శించి, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అక్కడే బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడినుంచి డుంబ్రిగుడకు చేరుకుంటారు. అల్లూరి జిల్లాకు మంజూరు చేసిన సుమారు 200 రోడ్ల నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. తర్వాత అరకులోయ వెళ్లి ఏపీటీడీసీ హరిత రిసార్ట్స్‌లో రాత్రి బసచేస్తారు. మరుసటి రోజు(మంగళవారం) ఉదయం 10 గంటలకు అరకులోయ మండలం సుంకరమెట్ట సమీపంలోని కాఫీ తోటలకు చేరుకుని, అటవీ శాఖ చెక్కలతో నిర్మించిన కాలిబాట వంతెనను ప్రారంభిస్తారు. అనంతరం రోడ్డు మార్గంలో పవన్ విశాఖపట్నం ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కుకు చేరుకొని ఎకో టూరిజంపై అధికారులతో సమీక్షిస్తారు.

# కంచె గచ్చిబౌలిని శాశ్వతంగా కాపాడుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

నిస్వార్థమైన విద్యార్థి-ప్రజా పోరాటాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయని కెటిఆర్ తన లేఖలో పేర్కొన్నారు. వందల రకాల జంతుజాలం, వృక్షజాతులతో ఉన్న ప్రాంతాన్ని కాపాడేందుకు, భవిష్యత్ తరాలకు అందించేందుకు విద్యార్థులు చేసిన పోరాటానికి దేశంలోని వివిధ రంగాల ప్రముఖులు కలిసి రావడం దీనికి నిదర్శనం అని వ్యాఖ్యానించారు. 400 ఎకరాల పర్యావరణం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. 734 జాతుల మొక్కలు, 220 పక్షులు, 15 సరీసృపాలు, 10 క్షీరదాల ఆవాసం నాశనం కాకుండా ఆపుదాం అని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ దళారి మాదిరి ఆర్థిక ప్రయోజనాల కోసం ఆలోచించకుండా, భవిష్యత్ ప్రయోజనాల కోసం కంచె గచ్చిబౌలి వేలాన్ని పూర్తిగా విరమించుకోవాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. పోరాటం ఇంకా మిగిలే ఉంది.. అందరూ కలిసి రావాలిరాష్ట్ర ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ కోసం, బెదిరింపు ధోరణిలో ఏకో పార్క్ ఏర్పాటు అంటూ, ఫోర్త్ సిటీకి సెంట్రల్ యూనివర్సిటీ తరలింపు అంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మొదలుకొని ప్రతి కాంగ్రెస్ నాయకుడి వరకూ పక్కా కుట్రతో మాట్లాడుతున్న మాటలను కెటిఆర్ తన లేఖలో ఎండగట్టారు. 50 సంవత్సరాలకు పైగా సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణకు, విజ్ఞానానికి కేంద్రంగా నిలిచిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రాపగండ చేస్తున్న ఏకో పార్క్ కన్నా గొప్పగా పర్యావరణ సమతుల్యత కలిగిన క్యాంపస్‌గా నిలిచిందని అన్నారు. విద్యార్థుల పోరాటం ఫలించి సుప్రీంకోర్టు ప్రభుత్వం చేసిన పర్యావరణ హత్యను అడ్డుకున్నదని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రల నేపథ్యంలో ఈ పోరాటం పూర్తిగా అయిపోలేదని తెలిపారు. 400 ఎకరాల పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాటం ఇంకా మిగిలి ఉందని అన్నారు. ప్రభుత్వ కుట్రలను, బెదిరింపులను, దుష్ప్రచారాన్ని దాటుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రముఖులు, తెలంగాణ ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు బిఆర్ఎస్ అండగా ఉంటుంది

ఇప్పటికే తమ పార్టీ తరఫున 400 ఎకరాల పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించామని కెటిఆర్ తెలిపారు. ప్రకృతికి విఘాతం కలగకుండా, యూనివర్సిటీకి ప్రమాదం రాకుండా బిఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల స్ఫూర్తిని, విద్యార్థుల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని, పర్యావరణం కోసం 400 ఎకరాలను వేలం వేసే ప్రయత్నాన్ని పూర్తిగా విరమించుకుంటున్నట్లు ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా ప్రస్తుత పోరాటాన్ని కొనసాగిద్దామని కెటిఆర్ పిలుపునిచ్చారు.

# జలవివాదంపై గట్టి వాదనలు

## నీటి వాటాలపై ఏపీతో గట్టిగా తేల్చుకునేందుకు సిద్ధమైన తెలంగాణ

**హైదరాబాద్ ప్రజావినికిడి,:** కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో నెలకొన్న వివాదంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఏపీ తన వాటాకు మించి నీటిని వాడుకుంటుందనే ఆరోపణల నేపథ్యంలో, కృష్ణా ట్రిబ్యునల్‌లో గట్టిగా వాదనలు వినిపించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా చర్చలు జరిపారు. హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఏప్రిల్ 15, 16, 17 తేదీల్లో సుప్రీంకోర్టులో జరగనున్న విచారణలో తెలంగాణ తన వాదనను బలంగా వినిపించేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా నీటి పంపకాల విషయంలో స్పష్టత రాకపోవడంతో, తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాపై ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే న్యాయపరంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తన వాదనలతో ఏపీ వాదనలకు దీటుగా బదులిస్తారని తెలంగాణ ధీమాగా ఉంది.

# పాంబన్ వంతెనను ప్రారంభించిన మోదీ..

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం జరిగిన సభలో ప్రధాని ప్రసంగించారు. తమిళనాడుకు రావలసిన నిధులను కేంద్రం నిలిపివేసిందన్న సీఎం స్టాలిన్ ఆరోపణలను మోదీ ఈ సందర్భంగా ఖండించారు. గతంతో పోలిస్తే గడిచిన పదేళ్లలో తమిళనాడుకు 3 రెట్లు అధికంగా నిధులిచ్చామన్నారు. 'గత పదేళ్లలో తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను 7రెట్లు పెంచాం. రామేశ్వరం సహా రాష్ట్రంలో 77 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. పీఎం ఆవాస్ యోజన కింద తమిళనాడులో 12 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఈ రాష్ట్రంలో కోటికిపైగా చికిత్సలు జరిగాయి' అని తెలిపారు. హిందీ భాషను కేంద్రం తమపై రుద్దాలని చూస్తోందని ఆరోపిస్తున్న స్టాలిన్‌పై ప్రధాని పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'చాలా మంది తమిళనాడు నాయకులు నాకు లేఖలు రాస్తుంటారు. కానీ ఎవరూ తమిళంలో సంతకం చేయరు. నిజంగా వారికి తమిళ భాష అంటే అంత అభిమానముంటే మొదట తమిళంలో సంతకం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. %దేశంలోనే మొట్టమొదటి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన 'పాంబన్ బ్రిడ్జి'ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించారు. భారత భూభాగాన్ని రామేశ్వరంతో కలుపుతూ నిర్మించిన ఈ వంతెనను మోదీ జాతికి అంకితం చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, రూ. 535 కోట్లు వెచ్చించి తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఈ వంతెనను నిర్మించారు. 2020లో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) పనులు చేపట్టి, నాలుగేళ్లలో పూర్తిచేసింది. సముద్రంలో 2.08 కి.మీ. పొడవున్న ఈ వంతెనపై రైళ్ల రాకపోకలు సాగించేలా, కింది నుంచి ఓడలు వెళ్లేందుకు వీలుగా వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. 2019 మార్చి 1న ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్ర మోదీ... ఆదివారం ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. మోదీ పచ్చజెండా ఊపగానే ఈ బ్రిడ్జి పైనుంచి రామేశ్వరం-తాంబరం స్పెషల్ ట్రైన్ పరుగులు తీసింది.

# సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎంఏ బేబీ

## మధురై మహాసభల్లో ఎన్నిక

## 18మందితో పొలిట్ బ్యూరో, 85 మందితో కేంద్ర కమిటీ



**హైదరాబాద్ ప్రజావినికిడి,:** సిపిఎం నూతన ప్రధాన కార్యదర్శిగా కేరళ విద్యాశాఖ మాజీ మంత్రి ఎంఏ బేబీ ఎన్నికయ్యారు. సిపిఎం మహాసభలు తమిళనాడులోని మదురైలో ఈ నెల 2న ప్రారంభమై 6వ తేదీన ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా70 ఏళ్ల ఎంఏ బేబీని పార్టీ కొత్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 18మందితో కొత్త పొలిట్ బ్యూరో, 85మందితో పార్టీ కేంద్ర కమిటీని కూడా ఎన్నుకున్నారు. అయితే ఈ సారి కేంద్ర కమిటీలో 25శాతం మంంది మహిళలు ఉండడం విశేషం.ప్రధాన కార్యదర్శి పదవికి ఎంఏ బేబీ పేరును పార్టీ కోఆర్డినేటర్ ప్రకాష్ కారత్ ప్రతిపాదించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సీతారాం ఏచూరి మృతి అనంతరం ఆ పదవి ఖాళీగా ఉంది. తాత్కాలికంగా కారత్ ఆ పదవిని నిర్వహిస్తూ వచ్చారు. మైనారిటీ కమ్యూనిటీ నుంచి సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తొలి నేత బేబీనే. ప్రధాన కార్యదర్శి పదవికి రేసులో సీనియర్ నేతలు అశోక్ ధవలే, బివి రాఘవులు, బృందా కారత్, మహ్మద్ సలీం తదితరులు పేర్లు ఉన్నప్పటికీ బేబీవైపే మొగ్గు చూపారు. ఇక పార్టీలో మరో వర్గం ఆలిండియా కిసాన్ సభ మాత్రం ధవలే పేరును గట్టిగా తెరపైకి తెచ్చినట్లు సమాచారం.

# ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కోడింగ్‌పాఠాలు

## అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సహకారంతో విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలు

## విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు



**అమరావతి,పజావినికిడి,:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్యాలను నేర్పించేందుకు ఈ-కామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్ ఏపీలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా ముగిసింది. మూడు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ (ఏఈఎఫ్) శిక్షణ అందించింది. గతేడాది దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించగా.. ఆంధ్రప్రదేశ్ లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. ఈమేరకు సమగ్రశిక్ష, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, క్వెస్ట్ అలయన్స్ అనే స్వచ్ఛంద సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మూడు జిల్లాల్లో 248 మందికిపైగా ఉపాధ్యాయులు, 7,381 మంది విద్యార్థులకు కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతులలో నేర్పించింది. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులను గుర్తించి విశాఖపట్నంలో హ్యాకథాన్‌ను నిర్వహించారు. విజేతలకు ల్యాప్‌టాప్, ట్యాబ్‌లు, టీవీలను బహుమతులుగా ఇచ్చి ప్రోత్సహించారు. కాగా, రాబోయే మూడు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది ఉపాధ్యాయులకు, 50 వేల మంది విద్యార్థులకు ఏఐ, కోడింగ్ నైపుణ్యాలను నేర్పించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఏఈఎఫ్ రాష్ట్ర సమన్వయకర్త మాధవీలత తెలిపారు.

# సన్నబియ్యం పంపిణీ పథకంతో పేదవారి కళ్లలో ఆనందం

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి భోజనం చేశారు. తొలుత తమ ఇంటికి చేరుకున్న ముఖ్యమంత్రికి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రేషన్‌షాపు నుంచి తీసుకువచ్చిన సన్నబియ్యంతో వండిన అన్నంతోపాటు పాయసం, పులిహోర, తోటకూర పప్పు, గోంగూర చట్నీ, బెల్లం పానకం, ఇతర ఆహార పదార్థాలు వడ్డించారు. కాగా, భోజనం చేస్తున్న సమయంలో సీఎం ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ వారి కుటుంబ పరిస్థితులు, జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం పథకం తమ లాంటి పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని వారు సీఎంకు తెలిపారు. మానవతా దృక్పథంతో నడిపిస్తున్న గొప్ప పథకమంటూ ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భోజనం అనంతరం ఆ కుటుంబ సభ్యులను సీఎం అభినందించారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

తమ కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. లబ్ధిదారు తల్లి పద్మావతి మాట్లాడుతూ.. తన భర్త శంకరరావు జీసీసీ సేల్స్‌మేన్‌గా పనిచేసి 2015లో రిటైరయ్యారని, తన కుమారుడు ఏంఏ బీఈడీ చదువుకుని కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తన కుమార్తె సుహాసిని చిన్నప్పటి నుంచి మానసిక ఇబ్బందులతోపాటు కనుచూపు లేక అవస్థలు పడుతోందని సీఎంకు చెప్పారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి.. వారి సమస్యలను పరిష్కారించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సుల వల్లే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఇంటికి భోజనానికి వచ్చారంటూ బూరం శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేదలమైన తమ ఇంట్లో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ శ్రీరామ నవమిని తమ జీవితంలో మర్చిపోలేమని అన్నారు.

# కమనీయంగా





**భద్రాచలం,, ఏప్రిల్ 06 ప్రజావినికిడి,:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేలాది భక్తుల సమక్షంలో సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరై సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్యమంత్రి దంపతులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది.

కాగా, భద్రాచలంలోని మిథిలా మైదానంలో సీతారాముల కళ్యాణ వేడుకకు వేదికగా నిలిచింది. అభిజిత్ లగ్నంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీరామచంద్రమూర్తి సీతమ్మ మెడలో మాంగల్యధారణ చేశారు. ఈ వేడుకకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం 9 గంటలకు కళ్యాణ క్రతువు ప్రారంభం కాగా, 10 గంటల సమయంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మిథిలా కళ్యాణ మండపానికి తీసుకొచ్చారు. కళ్యాణానికి మూడు నెలల ముందే గోటితో ఒలిచిన తలంబ్రాలను దేవాలయ నిర్వాహకులు సిద్ధం చేశారు. సీతమ్మకు ధరింపజేసే మంగళసూత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడు పోగులు కలిగిన ఈ మంగళసూత్రంలో ఒకటి సీతమ్మ పుట్టింటి వారిది కాగా, మరొకటి అత్తగారింటి వారిది. మూడవ పోగును భక్త రామదాసు తయారు చేయించారు.

కళ్యాణ ముహూర్త సమయం 12.02 నిమిషాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ జీలకర్ర బెల్లంను అద్దారు. ఆ తరువాత మాంగల్యధారణ మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. భక్తుల రామ నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. సీతారాముల కళ్యాణ ఘట్టం 12.40 నిమిషాలకు వైభవంగా ముగిసింది. ఈ వేడుకను చూసేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేసవి వేడిని సైతం లెక్కచేయకుండా భక్తులు తరలిరావడం విశేషం.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సీతారాముల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అటు, ప్రతి సంవత్సరము టీటీడీ తరుపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తుంది. ఈ సందర్భంగా ముందుగా భద్రాచలం ఆలయం వద్దకు సతీసమేతంగా చేరుకున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఈవో శ్రీమతి ఎల్. రమాదేవి ఆలయ సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం టీటీడీ ఛైర్మన్ దంపతులు సీతారాముల కళ్యాణంలో పాల్గొన్నారు.





ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం 7 ఏప్రిల్ 2025

# సీతారాముల కరుణ కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలి..

## రాజ శేఖర్ గంగపుత్ర..



ప్రజావినికిడి,(అంబర్ పేట్): అంబర్పేట డివిజన్లోని ప్రేమనగర్ శ్రీ వీర అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీ రామ నవమి వేడుకలను కనుల పండుగగా నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోగులకొండ ప్రతాప్ గౌడ్,తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి విభాగం నాయకుడు రాజశేఖర్ గంగపుత్ర పాల్గొని భక్తులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలందరిపై సీతారాముల వారి కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని సీతారాముల వారి ఆశీస్సులు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో పురోహితులు లక్ష్మణాచార్యులు, ఆచార్య ఆత్రేయ, పవన్,మహేష్, వినయ్,సుధాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మునగనూర్ శనీశ్వర ఆలయంలో వైభవంగా ముగిసిన సీతారాముల కళ్యాణం మహోత్సవం..






**ప్రజావినికిడి,(మునగనూరు):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని మునగనూర్ గ్రామం ద్వారకావెంకటసాయి నగర్ కాలనీలోని శ్రీ శనీశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం మహోత్సవం కన్నుల పండువగా సాగింది.ఈ కళ్యాణం మహోత్సవంలో మునగనూర్ వాస్తవ్యులు వంగేటి చంద్రకాంత్ రెడ్డి దంపతులు,పాల్గొని స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి కళ్యాణం జరిపించడం జరిగింది. ఈ వివాహం కార్యక్రమంలో గ్రామ ప్రజలు అదేవిధంగా ఇతర గ్రామాల,పలు కాలనీల ప్రజలు సుమారు పదిహేను వందల మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం వంగేటి సంజీవరెడ్డి ఇంద్ర పబ్లిక్ స్కూల్ చైర్మన్ కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నదాన వితరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఈ పర్వదినాన ఆ సీతారాముల ఆశీస్సులు దేశ ప్రజల పట్ల ఉండాలని, పాడిపంటలతో రైతు సంతోషంగా ఉండాలని,దేశం సస్యశ్యామలంగా ఉండేలా చూడాలని స్వామి వారిని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ పూజారి అనిల్ శర్మ,కమిటీ సభ్యులు,సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళలు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.





ప్రజావినికిడి, (రాజేంద్రనగర్ ):శంషాబాద్ మండల్ పరిధిలోని నర్కూడ అమ్మపల్లి దేవాలయంలో ప్రముఖ,ప్రాచీన రామాలయంలో జరిగిన సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవములో పాల్గొన్నారు.స్వామి వారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు.. సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ ప్రత్యేకమైన శ్రీరామనవమి రోజున ఆ శ్రీరాముని అనుగ్రహంతో మీ జీవితంలో కొత్త వెలుగు నిండాలని,అన్నింటి పరంగా వస్తున్న సమస్యలు తొలగిపోవాలని కోరుకోవడమైనది అన్నారు.పుణ్య దంపతులైన సీతారాముల శుభాశీస్సులతో మనందరి మనసులు ఎప్పుడూ ప్రేమ,కరుణ లతో నిండి,మంచి నడవడికలతో సమాజ శ్రేయస్సు కోసం ప్రతీ ఒక్కరూ ఆదర్శ ప్రాయంగా నిలవాలని ప్రార్థించి ప్రజలందరికి శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

# కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణోత్సవం..

### సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

### షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆదర్శప్రాయం శ్రీరాముని వ్యక్తిత్వం,రామాయణం కేవలం ఒక కథ కాదు అది జీవన సారం కుటుంబ వ్యవస్థను ప్రతిబింబించే ఓ మహాకావ్యం శ్రీరామునిది
ఒకే మాట ఒకే బాణం, ఏకపత్నీ వ్రతం వేయికళ్లతో ఎదురుచూసే శ్రీ సీతారాముల కల్యాణం షాద్ నగర్ పట్టణంలోని జనపేట వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కనులపండుగగా జరిగింది.అందుకు వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆలయ అధికారులు,ఆలయ కమిటీ సభ్యులు సుందరంగా ముస్తాబు చేశారు.పట్టణంలోని పలు కాలనీలలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు.తద్వారా పట్టణంలోని పురవీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. కల్యాణ ఘట్టం జరిగిన ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. అభిజిత్ నగ్నమందు శ్రీ సీతారాముల కల్యాణం జరిగింది.ఈ అభిజిత్ నగ్నమందే జీలకర్ర బెల్లాన్ని సీతారాముల తలపై పెడతారు.కమనీయంగా సాగే కల్యాణ వేడుకకు ప్రతి ఏటా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ప్రభుత్వం అందించడం ఆనవాయితీ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాములవారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.
శ్రీరామ సీత కళ్యాణోత్సవం భారీ సంఖ్యలో పాల్గని శ్రీరాముని కళ్యాణోత్సవాన్ని తిలకించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు,ఆలయ కమిటీ సభ్యులు అదేవిధంగా జానంపేట పట్టణానికి చెందిన పుర ప్రముఖులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బాహుపేట-చొల్లేరు మధ్య బీటీ రోడ్డును వేయాలని కేంద్ర మంత్రికి వినతి..



**ప్రజావినికిడి, (భువనగిరి):** యాదగిరిగుట్ట మండలం భువనగిరి పార్లమెంటు ఆలేరు నియోజకవర్గం పరిధిలోని బాహుపేట-చొల్లేరు మధ్య బీటి రోడ్డును వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నాంపల్లి రాష్ట్ర కార్యాలయంలో కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్,చిరిగె శ్రీనివాస్ కలసి విన్నవించారు.ఈ సందర్భంగాచిన్నకందుకూరు గ్రామంలోని ప్రజలకు వర్షా కాలంలో వాగు వచ్చినప్పుడు ఎవరైనా చనిపోతే స్మశానానికి కూడా తీసుకుపోలేని పరిస్థితి నెలకొందని అన్నారు.అలాగే పరిసర ప్రాంతాలలో లోని రైతులు వర్షాకాలంలో సరైన రోడ్డు వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రితో తెలిపారు. కేంద్ర మంత్రి,కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తక్షణమే రాష్ట్ర ముఖ్య కార్యదర్శితో మాట్లాడి త్వరలోనే మంజూరు చేయుటకు కృషి చేస్తానని హామీనిచ్చారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు సబ్బురు వీర స్వామి, సముద్రాల నవీన్ కుమార్,గంధమల్ల మహేష్,గంధమల్ల లక్ష్మినారాయణ, ఎలగందుల మనోహర్, పద్మ, నవీన్,లోడే నవీన్,సబ్బురు పెద్దపురం,సబ్బురు శ్రీకాంత్,గుండ్లపెల్లీ మధు,మెరుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం..

## షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహణ..

### బీజేపీ ఒక ఉద్యమం నుండి.. ఒక శక్తిగా మారిన విజయగాథ..! నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి..

### బీజేపీ అంటే అభివృద్ధికి మరో పేరు అందే బాబయ్య..

### శ్రీరామనవమి రోజున బీజేపీ ఆవిర్భావ దినోత్సవం.ఇది యాదృచ్ఛికం కాదు..ఇది రాముడి సంకేతం..! విష్ణు వర్ధన్ రెడ్డి..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్‌నగర్ పట్టణంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.పట్టణ బీజేపీ అధ్యక్షులు హరి భూషణ్ పటేల్ ఆధ్వర్యంలో 27,11, 13,14,15,9 నంబర్ వార్డులలో బూత్ అధ్యక్షుల చేతుల మీదుగా జెండా ఆవిష్కరణలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథితులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్న నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి,పాల్గొన్నారు.
శ్రీ వర్ధన్ రెడ్డి ప్రసంగిస్తూ:1951లో భారతీయ జనసంఘ్ రూపంలో మొదలైన ఈ ఉద్యమం,1980లో అధికారికంగా భారతీయ జనతా పార్టీగా (బీజేపీగా) మారింది.2 సీట్లతో మొదలైన ఈ ప్రయాణం,నేడు 20 రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిన పార్టీగా ఎదిగింది!ఇది నాయకుల పార్టీ కాదు.. కార్యకర్తల పార్టీ!ఇది అధికారంలో ఉండే పార్టీ కాదు.. దేశానికి సేవచేసే పార్టీ!ఈ పార్టీ క్రమశిక్షణ, త్యాగం,దేశభక్తి అనే మూలస్తంభాల మీద నిలబడింది.శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ్, అటల్ బిహారీ వాజ్‌పేయీ,ఎల్కే అద్వానీ వంటి మహానుభావులు ఈ పార్టీకి మార్గదర్శకులుగా నిలిచారు.ఇప్పుడు మన పెద్దల ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, నరేంద్ర మోదీ నాయకత్వంలో2047 కల్లా 'వికసిత్ భారత్' గా మన దేశాన్ని తీర్చిదిద్దడం మన లక్ష్యం!ప్రతి గ్రామంలో కమలం వికసించాలి!ప్రతి గుండెల్లో దేశభక్తి జ్వాల దహించాలి..! ప్రతి బూత్ లో మన బీజేపీ జెండా ఎగురాలి..!
అందే బాబయ్య మాట్లాడుతూ, "బీజేపీ ప్రభుత్వంలో పేదవాడి ఇంట్లో గ్యాస్ సిలిండర్ వెలిగింది! వాడు ఇంతవరకూ కలలో కూడా ఊహించని సౌకర్యం ఇంటి చుట్టూ వచ్చి ఆగింది!"అన్నదాతకు పంటకే మద్దతు ధర వచ్చింది! రైతు కష్టానికి,భూమి తపనకు..నిజమైన విలువ వచ్చింది! "వాడు శ్రమించిన పనికి గౌరవం దక్కింది%ౌ%వాడి నోటి మాటకు గుర్తింపు దక్కింది.. ఆత్మగౌరవం, స్వాభిమానం నిలబడింది!బీజేపి ఎవరికైనా ఆపాదించిన పార్టీ కాదు!ప్రతి వర్గానికీ మైనారిటీ అయినా మెజారిటీ అయినా తలదాచుకునే మానవత్వం చూపిన పార్టీ! మతం,కులం, ప్రాంతం..ఇవన్నీ ఓ పక్కకు పెట్టి బీజేపీ ఓటమి కాదు..ఒప్పందం చేసింది దేశాభివృద్ధితో!వాగ్దానాల కోసం కాదు%ౌ%జీవితాలు మార్చడానికే పీఎం కిసాన్ యోజన వచ్చింది రైతు ఖాతాలో నేరుగా డబ్బు వేసింది!"ఆయుష్మాన్ భారత్ పథకం%ౌ%ఆరోగ్యం తలుపు తట్టనంతవరకూ%ౌ% సామాన్యుడికి ఆదరణ ఇచ్చింది!ఉజ్వల యోజన ఇంధనం దూరం కాదు..ఇంటి గుమ్మం దాకా తీసుకొచ్చింది!ముద్రా పథకం ఒక్క పది రూపాయల కెపిటల్ లేక భవిష్యత్తు కలలే కలలు కాబడ్డ యువతకి..ఓ కిందటి ధైర్యం అయింది! బీజేపీ కులాలు చూడదు! మతాలు చూడదు! వర్గాలు చూడదు!దేనికంటే ముందు చూస్తది ఈ దేశ భవిష్యత్తును! మా కళ్లకెదురుగా ఉన్నదీ ఒకటే లక్ష్యం..వికసిత భారత్ ఇప్పుడు..ప్రతి ఓటరు ఒక్కసారి ఆలోచించాలి..దేశాన్ని గెలిపించాలంటే మనమే ముందుకు రావాలి!"ఒక్క ఓటు మేం వేసే ఓటే వికసిత భారత్‌కి ఓ బలం అవ్వాలి!!ఇది మాట కాదు..ఇది ఒక నడిమిదారిలో దేశ భవిష్యత్తుని తీర్చిదిద్దే సంకల్పం!ఇది మోదీ గారి నాయకత్వం చూపిన మార్గం%ఇది బీజేపీ చూపిన ధర్మం!"పాలమూరు విష్ణు వర్ధన్ రెడ్డి ప్రసంగిస్తూ: ఈ రోజు చాలా ప్రత్యేకం.ఎందుకంటే రామలక్ష్మణుల ఆశీస్సులతో, అయోధ్యలో శ్రీవరామ మందిరం నిర్మాణం తర్వాత తొలిసారిగా వచ్చిన శ్రీరామనవమి వేడుకలు..అదే రోజు బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం కూడా జరగడం అనేది కేవలం సమయానుకూలత కాదు..అది భగవంతుని సంకేతం!ఈ రోజు శ్రీరాముడి ఆశీర్వాదం మన బీజేపీ పార్టీ మీద ఉందని నాకు పూర్ణ విశ్వాసం ఉంది.మన పండుగలు,మన పరంపర,మన ధర్మంఇవన్నీ బీజేపీ ద్వారా మరింత శక్తిగా దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.ఇప్పుడే కాదు..బీజేపీ స్థాపన నుండి హిందూ ధర్మ రక్షణకే మేం నిలబడ్డాం. అయోధ్యలో శ్రీవరామ మందిర నిర్మాణం పోరాటానికి ప్రతిఫలం. ఇది కేవలం బిల్డింగ్ కాదు.. ప్రతి హిందువి గర్వం.!ఈ రామనవమి రోజు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం జరగడం అన్నది మనకు ఒక సంకేతం..మన పథం సరిగానే ఉందని,మన పోరాటం ఫలిస్తోందని, మన గమ్యం సాధ్యం అవుతుందని! దేశం మొత్తం ఈ రోజు ఒకే గాత్రంతో గర్జిస్తోంది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మనో రెడ్డి,బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అశోక్ ప్యాట,యువ నాయకులు వంశీ ప్రశాంత్,సీనియర్ నాయకులు నందిగాం వెంకటేష్, శేరి విష్ణువర్ధన్ రెడ్డి, మోహన్ సింగ్,జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ చారి,మట్టం ఋషికేశ్,పట్టణ ప్రధాన కార్యదర్శి జంబుల నరసింహ,పట్టణ ఉపాధ్యక్షులు మల్చలం రాము, మంగ విజయ్,శ్యామ్ సుందర్, కాసోజు శివ, కుడుముల బాలరాజ్, కొంకల మణికంఠ, ఆనంద్,బూత్ అధ్యక్షులు ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి రవి, బాలకృష్ణ,రామ్ చందర్,కృష్ణారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల పోరు గర్జనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు..

### అఖిల భారత విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం..



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):ఏప్రిల్ 6,** అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కౌలె జగన్నాథం నాయకత్వంలో అనంతోజు బ్రహ్మాచారి కుల్కచర్ల శ్రీనివాస్ . పర్యవేక్షణలో..బీసీ సంఘం విశ్వకర్మ నాయకులు దిగోజు నరసింహచారి, పాములపర్తి వేణుగోపాల చారి,వడ్ల బిక్షపతి,వెంకటేష్, సుదర్శన్,మహిళా సంఘం నాయకులు జయశ్రీ, గంగాభవాని,స్వప్న అరుణ,విజయమ్మ, మంజుల పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో వేలాదిమందిగా, తరలివచ్చి,ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన బీసీల పోరు గర్జనను విజయవంతం చేసి తిరిగి గమ్యానికి చేరుకుంటున్న సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా,అన్నిటికి ఓర్చుకొని తిరిగి క్షేమంగా మన ఇంటికి చేరుకుంటున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి వచ్చిన బీసీ, విశ్వకర్మ నాయకులకు మహిళలకు యువకులకు మేధవులకు విశ్వకర్మ కమిటీ తరఫున పేరుపేరునా ఉద్యమ అభినందనలు తెలియజేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# హిందూవాహిని ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీరాముని శోభాయాత్ర..

## వేలాదిగా తరలివచ్చిన నియోజక వర్గ ప్రజలు..

ప్రజావినికిడి,(షాద్ నగర్):
జెండా ఊపి శ్రీరామ శోభయాత్రను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,బండారి రమేష్,బిజెపి కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య హిందూ వాహిని ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముని శోభాయాత్ర వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి అనూహ్యమైన స్పందన లభించింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు శోభాయాత్రలో పాల్గొని భక్తిశ్రద్ధలతో శ్రీరాముని నామస్మరణలో లీనమయ్యారు. ఈ శోభాయాత్రను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రముఖ నాయకులు బండారి రమేష్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,అందే బాబయ్య, చెట్ల వెంకటేష్,గుడాల రమేష్ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి రథయాత్రలు,బజానలు,నృత్యగీతాల సమాహారంతో ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా ప్రసంగించిన



నేతలు శ్రీరాముని ఆదర్శాలను యువత అనుసరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ధర్మం, నీతి,సమానత్వం స్థాపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. హిందూ వాహిని సభ్యులు, శ్రేయోభిలాషులు, భక్తజనులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు..





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** షాద్ నగర్ మున్సిపాలిటీలో గల స్థానిక 9వ వార్డు శ్రీ భవాని సహిత రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ కన్నుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమంలో విజయనగర్ కాలనీ వెంకటరమణ కాలనీ భగీరథ కాలనీ అదేవిధంగా అనుబంధ కాలనీ నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కళ్యాణాన్ని తిలకించిపరవశించరు. స్వామి వారి కళ్యాణం అనంతరం అన్నప్రసాద స్వీకరించి స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులైనారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు జి.మహిపాల్ రెడ్డి భక్తులకు అన్నప్రసాదన వితరణ చేశారు. సీతారామ కళ్యాణం మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు ఇచ్చేసి స్వామివారి దర్శనార్థం చేసుకున్నారు.

# లోక కళ్యాణం కోసమే

## సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..దంపతులు..

ప్రజావినికిడి,(షాద్ నగర్):
శ్రీరామనవమిని పురస్కరించుకొని షాద్‌నగర్ ఆర్టీసీ కాలనీలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు మాచల మురళి,విష్ణుమూర్తి, బాల బ్రహ్మాచారి శేఖర్, సాయి కృష్ణ, నారాయణ,భిక్షపతి ఆధ్వర్యంలో శ్రద్ధగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి,తన సతీమణి తో కలిసి హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళ్యాణోత్సవాన్ని తిలకించి,ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులతో కలిసి ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, సీతారాముల కళ్యాణం అనేది కేవలం దేవతల వివాహ మహోత్సవం మాత్రమే కాదు. ఇది మన సంస్కృతిలో, సంప్రదాయాల్లో ఒక గొప్ప అధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక. ధర్మ మార్గం, నిజాయితీ జీవితం, దాంపత్య పవిత్రత వంటి విలువలు ఇందులో బోధించబడతాయి. ఇంటినుంచి ప్రారంభమయ్యే మంచి మార్గం,కుటుంబం ద్వారా సమాజానికి ధర్మ స్థిరత్వం ఏర్పడుతుంది. రాముడు,సీతమ్మల జీవితం



మనకు ఎన్నో బోధలు ఇస్తుంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో భారతీయ సంస్కృతి పట్ల గౌరవం పెరగాలి. రామాయణం మనకు జీవితానికి దిక్సూచి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో భారతీయ సంస్కృతి పట్ల గౌరవం పెరగాలి. నేటి తరాలు దేవతల కథల్లో ఉన్న జీవన పాఠాలను అవగతం చేసుకోవాలి. సమాజం ముందుకు పోవాలంటే ధర్మ మార్గాన నడవాల్సిందే. మనకు దిక్సూచి లాంటి పాత్రను ఈ రామాయణం పోషిస్తోంది. ఈ భక్తి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన దేవస్థానం కమిటీకి,సహకరించిన అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరింత



విస్తృతంగా జరగాలని ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, ప్రశాంత్,భూషణ్, నర్సింహ,వంశీ, రుషికేష్ తదితరులు పాల్గొని తనంతటవాడే సేవలు అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో కళ్యాణాన్ని తిలకించారు.

## ఘనంగా శ్రీ రామనవమి వేడుకలో..

# పాల్గొన్న చైర్మన్ గుంటి లక్ష్మణ్..

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):ఏప్రిల్ 6**
ఎల్బీనగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం



భక్తులతో నిండిపోయింది. రాములవారి మంగళధ్వనిమేళాలతో, హారతులతో,పూలతో, మంగళకలశాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ అనే నామస్మరణతో దేవాలయ ప్రాంగణం మొత్తం మార్మోగించారు. పల్లకీసేవ,రథోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ప్రాంతీయ ప్రజలు, భక్తులు అదేవిధంగా యాత్రికులు ఈ ఉత్సవాల్లో భాగస్వాములై,భక్తి భావంతో రామనామాన్ని జపిస్తూ శ్రీరాముని కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించామని ఆలయ ట్రస్టీ వ్యవస్థాపకులు అలాగే చైర్మన్ గుంటి లక్ష్మణ్ తెలిపారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా భక్తులు అధికంగా పాల్గొంటున్నారని ఈ కల్యాణ వేడుకల్లో సుమారు ఐదువేల మంది భక్తులు పాల్గొన్నారన్నారు. స్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు సూచించారు. సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రేమ్ కుమార్,అర్చక సంఘం,భక్తులు పాల్గొన్నారు.

# బారీ ఎత్తున గంజాయి ని పట్టుకున్న సైబరాబాద్ ఎస్ ఓ టి బాలానగర్ టీం..



**పోలీసుల కళ్ళు కప్పి అక్రమంగా ప్యాకర్ %ఴ% మూవర్స్ బొలెరో వెహికల్లో 273 కిలోల గంజాయి నీ ఒరిస్సాలోని కలిమెల నుండి హర్యానకు తరలిస్తుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శామీర్పేట ఓ ఆర్ ఆర్ వద్ద ఎస్ ఓ టి బాలానగర్ శామీర్పేట పోలీసులు పట్టుకున్నారు..**
**ఇందులో 55 ప్యాకెట్లలో దాచిన 273 కిలోల రూ 96,25,000 విలువగల గంజాయి పట్టుబడింది..**

**ప్రజావినికిడి,(బాలానగర్)**
గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ప్యాకర్స్ మూవర్స్ యజమాని హర్యానకు చెందిన పరదీప్ కుమార్ అలాగే అందరిని అదుపులోకి తీసుకున్నారు.
గంజాయిని అక్రమంగా రవాణాలో సూత్రధారి పంజాబ్ కు చెందిన సాయిల్ పరారీలో ఉన్నాడు. ఇతను 2021 లో రాజేంద్రనగర్ ఎన్ సి బి వారు గంజాయి కేసులో అరెస్ట్ చేయగా 2023 లో 10 సంవత్సరాల కఠిన జైలు శిక్ష పడగా,గౌరవ హై కోర్టు ద్వారా బెయిల్ బయటకు వచ్చి మళ్ళీ అదేపనిగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నాడు. గంజాయిని అక్రమంగా పెద్దయెత్తున సమకూర్చుతున్న కలిమెల కు చెందిన సుభాష్ పరారీలో ఉన్నాడు.

**సీజ్ చేసిన వాటి వివరాలు**
273 కిలోల గంజాయి రూ. 96,25,000
బొలెరో వాహనం - రూ 5,00,000మొబైల్ ఫోన్ జియో డాంగిల్ - రూ 60,000
మొత్తం విలువ రూ 1,01,85,000



**నిందితుల వివరాలు**
1). పర్దీప్ కుమార్ ఏమెటా AI డ్రైవర్, %R/o% బోవిన్‌పల్లి, సికింద్రాబాద్ %N/o% కుండల్, పంజాబ్ ఫజిల్కా జిల్లా, పంజాబ్.
2). సాహిల్ %R/o% గోహనా (%ఎ%), సోనిపేట్ జిల్లా, హర్యానా %-% పరారీ
3)సుభాష్ బిస్వాస్ %MPV%72, కలిమెల, ఒడిశా %-% అబ్స్కాండింగ్
4)సన్నీవయస్సు 25, డ్రైవర్, R/o బోవెన్‌పల్లి సికింద్రాబాద్ N/o కైరు ,తోషం థానా, భివానీ జిల్లా, హర్యానా. గతంలో హర్యానా రాష్ట్రంలోని బెహల్ పోలీస్ స్టేషన్‌లో %ఫీ×=% నెం.59/2024 %ఖ/o 186, 307, 332, 353 IPC మరియు 25 ఆయుధ చట్టం ద్వారా క్రిమినల్ కేసులో చిక్కుకున్నారు.
5). మణిష్ కుమార్ %S/o% జైపాల్,వయస్సు 29, %Occ% డ్రైవర్ ప్యాకర్స్ మూవర్స్, %R/o% బోవెన్‌పల్లి, సికింద్రాబాద్ N/oలోహాని (వి),భివానీ జిల్లా,హర్యానా.
సైబరాబాద్ ఎస్‌ఓటి
బాలానగర్ టీం గత సెప్టెంబర్ నెలలో కూడా ప్యాకర్స్ మూవర్స్ ముసుగులో అక్రమ రవాణా అవుతున్న 252 కిలోల గంజాయి, విలువ 88,20,000/- గల దానిని పట్టుకోవడం జరిగింది. కేసును శామీర్పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అగ్రికల్చర్ కాలనీలో ఘనంగా సీతారాముల కళ్యాణం..







**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** హస్తినాపురం డివిజన్ అగ్రికల్చర్ కాలనీలోకన్నుల పండుగగా సీతారాముల వారి కల్యాణం.. ఆదివారంరోజు హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరామనవమి పండుగ సందర్భంగా పలు కాలనీ లో శ్రీ సీతారాముల వారి కల్యాణం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన అగ్రికల్చర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ప్రెసిడెంట్‌చంద్రమోహన్ రెడ్డి ట్రెజరర్ జితేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, శక్తి ఉన్నా ఒద్దికగా ఉండటం రామ తత్వం..భర్త వెంట నడవటం సీత తత్వం..కష్టాల్లో తోడు నిలవటం లక్ష్మణ తత్వం..నమ్మిన వారి కోసం తెగించటం ఆంజనేయ తత్వం. ప్రతి అడుగులో మంచిని గ్రహించాలన్నదే రామాయణ పరమార్థం
ఈ పవిత్ర శ్రీరామనవమి సందర్భంగా ఆభగవంతుడు మనందరి జీవితాల్లో ఆనందాన్ని,శాంతిని, సత్సంకల్పాలను నింపాలని ఆకాంక్షిస్తూ శ్రీ రాముని ఆశీస్సులతోమీకు,మీ కుటుంబానికి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలనిమనసారా ప్రార్థిస్తూ..శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామ కళ్యాణ మహోత్సవం సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు కార్పొరేటర్లు పోలీస్ శాఖ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా కాలనీవాసులు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి ఆశీస్సులు తీసుకొని అనంతరం అన్న ప్రసాదం స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ కాలనీ రెసిడెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ప్రెసిడెంట్‌చంద్రమోహన్ రెడ్డి ట్రెజరర్ జితేందర్ రెడ్డి సెక్రెటరీ సుబ్బారావు ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేము సన్న బియ్యం ఇచ్చాము దేశం మొత్తం బిజెపి ఇవ్వాలి: మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ ప్రజావినికిడి,:**
42 శాతం బిసి రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్లో చేర్చేలా చట్టబద్ధత కోసం దమ్ముంటే ప్రధానిని ఒప్పించాలని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాలు చేశారు. కేంద్ర మంత్రి అన్న సంగతి మర్చిపోయి దిగజారి మాట్లాడుతున్నాడని ఆయన బండి సంజయ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పెద్దలకు భయపడే తెలంగాణ బిజెపి నేతలు బిసిల ధర్నాకు మొహం చాటేశారని విమర్శించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ ఢిల్లీ పెద్దలకు గులాంగిరి చేశాడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అని, ఏదైనా సమిష్టి నిర్ణయాలు ఉంటాయని ఆయనన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఎంఎల్‌సి ఎన్నికల వలె స్థానిక సంస్థలు





ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేక రహస్య మిత్రుడు బిఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆయన బిజెపిపై ధ్వజమెత్తారు. బండి సంజయ్‌లో రోజురోజుకు అభద్రత భావం పెరిగిపోతుందని, సొంతపార్టీ నేతలే బండి సంజయ్ వైఖరి పై గుర్రుగా ఉన్నారని దుయ్యబట్టారు. అధ్యక్ష పదవి రాదని తెలిసి బండి సంజయ్ ఆగమాగం అయితుండని విమర్శించారు. తాను కేంద్ర మంత్రి అన్న సంగతి మర్చిపోయి దిగజారి మాట్లాడుతున్నాడని, బిజెపిలో గుర్తింపు కోసం బండి సంజయ్ ఆరాటమని దుయ్యబట్టారు. ఇకనైనా బాధ్యత గల కేంద్రమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి బండి సంజయ్ కి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సుదీర్ఘ కాలంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి నియామకం చేసుకోలేని బిజెపికి కాంగ్రెస్ హై కమాండ్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613



# పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా

## దిగ్వేష్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత



లఖ్‌నవూ: ముంబైతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. లఖ్‌నవూ బౌలర్లు నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన దానికంటే ఓ ఓవర్ వెనుకబడ్డారు. దీంతో ఆఖరి ఓవర్‌లో రింగ్ వెలుపల ఓ ఫీల్డర్‌ను తగ్గించాల్సి వచ్చింది. ఇదే తొలి తప్పిదం కావడంతో సారథి పంత్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించినట్టు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, లఖ్‌నవూ స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ రెండోసారి ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించడంతో అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించారు. నమన్ ?ధిర్ అవుటైన తర్వాత కూడా అతడు మరోసారి నోట్‌బుక్ సెలబ్రేషన్స్ చేసుకొన్నాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ ఫీజులో సగం కోతతోపాటు రెండు డీమెరిట్ పాయింట్లు అతడి ఖాతాలో చేరాయి.





## హ్యాట్రిక్ విజయాల్లో ఢిల్లీ..

# ఓటముల్లో చెన్నై



చెన్నై: ఢిల్లీ క్యాపిటల్స్ జోరు కొనసాగిస్తూ ఈ ఐపీఎల్‌లో హ్యాట్రిక్ విజయం అందుకుంది. మరోవైపు చెన్నై సూపర్‌కింగ్స్ ఓటములలో హ్యాట్రిక్ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో క్యాపిటల్స్ 25 పరుగులతో చెన్నైని ఓడించింది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 183/6 స్కోరు చేసింది. కేఎల్ రాహుల్ (51 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 77) సొగసైన హాఫ్ సెంచరీ చేశాడు. అభిషేక్ పోరెల్ (20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సర్‌తో 33) సత్తా చాటాడు. స్టబ్స్ (24), కెప్టెన్ అక్షర్ పేటల్ (21) ఫర్వాలేదనిపించారు. ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 158/5కే పరిమితమైంది. విజయ్ శంకర్ (54 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 69 నాటౌట్), ధోనీ (26 బంతుల్లో ఓ ఫోర్, ఓ సిక్సర్‌తో 30 నాటౌట్) మాత్రమే రాణించారు. విప్రాజ్ 2 వికెట్లు తీశాడు. కేఎల్ రాహుల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.మారని సీఎసకే బ్యాటింగ్: మరోసారి చెన్నై బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ రచిన్ (3)తోపాటు జట్టులోకి వచ్చిన కాన్వే (13), కెప్టెన్ రుతురాజ్ (5) విఫలం కావడంతో పవర్ ప్లేలో 46/3తో నిలిచిన సీఎస్‌కే ఆపై ఏ దశలోనూ పోటీలోకి రాలేకపోయింది. శివమ్ దూబే (18), జడేజా (2) నిరాశపరిచారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందొచ్చిన ధోనీ, విజయ్ శంకర్ ఆరో వికెట్‌కు అభేద్యంగా 84 పరుగులు చేయడం ఓటమిలో చెన్నై జట్టుకు ఒకింత ఊరట.

కేఎల్ క్లాస్ ఇన్నింగ్స్: టాస్ గెలిచిన ఢిల్లీ తొలుత బ్యాటింగ్ ఎంచుకోగా..కేఎల్ రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. రెండు అర్ధ శతక భాగస్వామ్యాలతో జట్టు ఇన్నింగ్స్‌కు వెన్నుముకలా నిలిచాడు. అభిషేక్ పోరెల్‌తో కలిసి రెండో వికెట్‌కు 54 పరుగులు, సమీర్ రిజ్వీ (20)తో కలిసి నాలుగో వికెట్‌కు 56 రన్స్ జోడించాడు.

# రైజర్స్.. మరోసారి



### సొంతగడ్డపై చెలరేగిన సిరాజ్
### గిల్ అర్ధసెంచరీ గుజరాత్ హ్యాట్రిక్



**సొంత మైదానంలోనైనా అదరగొట్టేస్తుందేమోనని ఆశించిన సన్‌రైజర్స్ అభిమానులకు నిరాశే ఎదురైంది. తాము దూకుడుగానే ఆడతామని కెప్టెన్ ప్యాట్ కమిన్స్ టాస్‌కు ముందు బీరాలు పలికినా.. పేసర్ సిరాజ్ కెరీర్ బెస్ట్ బౌలింగ్ (4/17)కు బ్యాటింగ్ ఆర్డర్ చెల్లాచెదురైంది. ఇక హైదరాబాద్ బౌలింగ్‌లోనూ పస లేకపోవడంతో గుజరాత్ టైటాన్స్ ఆడుతూ పాడుతూ హ్యాట్రిక్ విజయాన్ని పూర్తి చేసింది.**

హైదరాబాద్: అన్ని విభాగాల్లో విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు వరుసగా నాలుగో ఓటమి. అటు వేదిక ఏదైనా విజయమే లక్ష్యంగా గుజరాత్ టైటాన్స్ చెలరేగుతోంది. ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్న టైటాన్స్ ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో రైజర్స్ తమ ఆఖరి స్థానాన్ని మరింత పదిలపర్చుకున్నట్టయ్యింది. అలాగే ఎస్ఆర్‌హెచ్‌పై గిల్ సేనకిది వరుసగా నాలుగో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 152 పరుగులు చేసింది. నితీశ్ (31), క్లాసెన్ (27), కమిన్స్ (22 నాటౌట్) మాత్రమే రాణించారు. సిరాజ్‌కు నాలుగు.. సాయికిశోర్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 16.4 ఓవర్లలో 3 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. గిల్ (43 బంతుల్లో 9 ఫోర్లతో 61 నాటౌట్) తుదికంటా నిలవగా.. సుందర్ (29 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 49), రూథర్‌ఫోర్డ్ (16 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 నాటౌట్) వేగంగా ఆడారు. షమికి రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సిరాజ్ నిలిచాడు.గిల్-సుందర్ అండతో..: స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన టైటాన్స్ తొలి ఐదు ఓవర్లలో చేసింది 28 పరుగులే. పైగా నిలకడగా రాణిస్తున్న ఓపెనర్ సాయిసుదర్శన్ (5), బట్లర్ (0)ల వికెట్లను కూడా కోల్పోయింది. ఈ స్థితిలో మ్యాచ్ రసవత్తరంగాసాగే అవకాశం ఉందనిపించింది. కానీ నాలుగో నెంబర్‌లో బరిలోకి దిగిన వాషింగ్టన్ సుందర్ ఒక్కసారిగా సీన్ మార్చేశాడు. ఆరో ఓవర్‌లో అతడు 20 పరుగులు సాధించి టైటాన్స్‌లో జోష్ నింపాడు. అనంతరం గిల్-సుందర్ జోడీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా ముందుకు సాగింది. 36 బంతుల్లో గిల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. మూడో వికెట్‌కు 90 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేశాక షమి ఓవర్‌లో సుందర్ అవుటయ్యాడు. అనికేత్ ఈ క్యాచ్‌ను పట్టడానికి ముందు బంతి నేలకు తాకినట్టు కనిపించినా థర్డ్ అంపైర్ అవుటివ్వడం చర్చనీయాంశమైంది. ఇక అభిషేక్ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ 18 రన్స్ రాబట్టడంతో రైజర్స్‌కు ఏమూలో ఉన్న ఆశలు కూడా అడుగంటాయి. 16వ ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో సమీకరణం 24 బంతులు 12 పరుగులకు మారింది. కానీ రూథర్‌ఫోర్డ్ 6,4తో మరో 20 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.సిరాజ్ హవా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌ను టైటాన్స్ బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా పేసర్ సిరాజ్.. పవర్‌ప్లే, డెత్ ఓవర్లలో వికెట్ల వేట సాగించాడు. మొదటి 12 ఓవర్లపాటు వీరి ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఆఖరి ఓవర్‌లోనే అత్యధికంగా 17 పరుగులు సమకూరాయి. నితీశ్-క్లాసెన్ జోడీ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. రెండు వరుస ఫోర్లతో జోష్ నింపిన ఓపెనర్ హెడ్ (8)ను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పేసర్ సిరాజ్ దెబ్బతీశాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ అభిషేక్ (18), ఇషాన్ (17) బౌండరీలతో స్కోరును ముందుకు తీసుకెళ్లారు. కానీ ఐదో ఓవర్‌లో ఒకే పరుగిచ్చి అభిషేక్‌ను సిరాజ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45/2 స్కోరుకే పరిమితమైంది. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో క్రీజులో ఉన్న నితీశ్, క్లాసెన్ కుదురుకునేందుకు ప్రాధాన్యమిచ్చారు. దీంతో 5-10 ఓవర్ల మధ్య వీరి నుంచి ఒక్క ఫోర్ కూడా నమోదు కాలేదు. చివరకు 11వ ఓవర్‌లో నితీశ్ రెండు ఫోర్లు సాధించగా, 13వ ఓవర్‌లో క్లాసెన్ 4,6తో ఆకట్టుకున్నాడు. ఇక ట్రాక్‌లోకి వచ్చాడనుకున్న క్లాసెన్‌ను సాయికిశోర్ ఫ్లాట్ డెలివరీతో బౌల్డ్ చేశాడు. దీంతో నాలుగో వికెట్‌కు 50 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు భారీ షాట్‌కు ప్రయత్నించిన నితీశ్‌ను సాయికిశోర్.. కమిందు (1)ను ప్రసిద్ధ్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చారు. కానీ 19వ ఓవర్‌లో మూడు పరుగులే ఇచ్చిన సిరాజ్ కళ్లు చెదిరే ఇన్‌స్వింగ్ యార్కర్లతో అనికేత్, సిమర్జీత్ (0) వికెట్లను పడగొట్టాడు. అయితే ఆఖరి ఓవర్‌లో కమిన్స్ 4,6.. షమి (6 నాటౌట్) 4తో సన్‌రైజర్స్ స్కోరు 150 దాటగలిగింది



# ఫైనల్లో జమ్వాల్

## బాక్సింగ్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరుగుతున్న బాక్సింగ్ వరల్డ్‌కప్‌లో భారత యువ బాక్సర్ అభినాష్ జమ్వాల్ ఫైనల్‌కు చేరుకొని కనీసం రజతం ఖాయం చేశాడు. పురుషుల 65 కిలోల సెమీసలో జమ్వాల్ 5-0తో గియాన్‌లుగి మలంగ (ఇటలీ)ను మట్టికరిపించాడు. ఫైనల్లో యూరీ రీస్ (బ్రెజిల్)తో అభినాష్ తలపడనున్నాడు. కాగా, 55 కిలోల సెమీసలో మనీష్ రాథోడ్ 0-5తో నూర్‌సుల్తాన్ అంటెన్‌బెక్ (కజకిస్థాన్) చేతిలో ఓడాడు.

# కౌర్‌కు స్వర్ణం.. ఇషాకు రజతం

## షూటింగ్ ప్రపంచ కప్



బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): భారత యువ షూటర్ స్విఫ్ట్ కౌర్, తెలంగాణ స్టార్ ఇషా సింగ్ ఐఎసఎసఎఫ్ వరల్డ్‌కప్‌లో పతకాలతో సత్తా చాటారు. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో స్విఫ్ట్ కౌర్ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఫైనల్లో కౌర్ ఫస్ట్ నీలింగ్ పొజిషన్‌లో అనిటా మ్యాన్‌గోల్డ్ (జర్మనీ) కంటే 7.2 పాయింట్లు వెనుకంజలో నిలిచినా.. ఆఖర్లో అదిరే ప్రదర్శన చేసింది. కౌర్ మొత్తం 458.6 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మ్యాన్‌గోల్డ్ రజతం, అరీనా అల్టుకొవా (కజకిస్థాన్) కాంస్యం దక్కించుకొన్నారు. ఇక, మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఇషా రజతం సాధించింది. ఫైనల్స్‌లో ఇషా 35 పాయింట్లతో రెండోస్థానంలో నిలవగా.. చైనా షూటర్లు యూజీ సన్ (38), సిజువాన్ ఫెంగ్ (30) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలను అందుకున్నారు.




# శ్రీరామనవమి శుభాకాంక్షలతో..

## స్టన్నింగ్‌గా రామం ఫస్ట్ లుక్

గోపీచంద్‌తో చిత్రాలయం స్టూడియోస్‌పై వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వేణు దోనెపూడి విశ్వం సినిమాను తెరకెక్కించారని తెలిసిందే. తాజాగా ఈ బ్యానర్ నుంచి అదిరిపోయే అప్‌డేట్ అందించారు మేకర్స్. వేణు దోనెపూడి టీం నిర్మిస్తోన్న కొత్త చిత్రం రామం ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రామం ఫస్ట్ లుక్ విడుదల చేశారు.జైశ్రీరామ్ నినాదంతో ఉన్న జెండాను పట్టుకొని గుర్రపుస్వామి చేస్తూ ఉన్న లుక్ స్టన్నింగ్‌గా కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. యోధుల గాథను ఆవిష్కరించే నేపథ్యంలో సినిమా ఉండబోతుందని ఫస్ట్ లుక్ ద్వారా తెలియజేశారు మేకర్స్. సమస్త మానవాళికి తారక మంత్రం శ్రీరామనామం. ధర్మ సంస్థాపనకు శ్రీరామచంద్రుడు చూపిన బాటే కాదు.. అధర్మాన్ని నిర్మూలించేందుకు ఆయన కోదండం చేపట్టి చూపిన వీరత్వం గురించి.. అలాంటి గొప్ప సమగ్ర మూర్తిమత్వాన్ని ఆధారంగా అలనాటి రామరాజ్యాన్ని నేటి కాలానికి కనెక్ట్ చేస్తూ ఇప్పటివరకు రానట్వంటి వైవిధ్యమైన కథతో ఈ సినిమా మీ ముందుకు రానుందని చెప్పుకొచ్చారు వేణు దోనెపూడి. ఈ సినిమాలో టాలీవుడ్‌కు చెందిన ఓ రైజింగ్ స్టార్ హీరోగా కనిపించబోతున్నాడని.. దేశవ్యాప్తంగా పాపులారిటీ ఉన్న యాక్టర్లు, సాంకేతిక నిపుణులు ఈ సినిమాలో భాగం కానున్నారని తెలిపారు. ఇంతకీ ఆ యంగ్ రైజింగ్ స్టార్ ఎవరనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# శ్రీలీలతో అభిమానుల అనుచిత ప్రవర్తన..



ఈ మధ్యన తెలుగులో వరుసగా అపజయాలు ఎదుర్కొంటోంది స్టార్ హీరోయిన్ శ్రీలీల. అందుకే గతేడాది గుంటూరు కారం సినిమా తర్వాత భారీ గ్యాప్ తీసుకుంది. పుష్ప 2లో కిస్సిక్ అంటూ స్పెషల్ సాంగ్ మాత్రమే చేసింది. ఇక ఇటీవల శ్రీలీల నటించిన మరో సినిమా రాబిన్ హుడ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వెంకీ కుడుముల తెరకెక్కించిన ఈ మూవీలో యూత్ స్టార్ నితిన్ హీరోగా నటించాడు. ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఆడియెన్స్ ను నిరాశపర్చింది. దీంతో శ్రీలీల ఖాతాలో మరో ఫ్లాఫ్ మూవీ పడింది. అయితే ఈ బ్యూటీ క్రేజ్ మాత్రం అసలు తగ్గడం లేదు. ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ చేతిలో పలు టాలీవుడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటితో పాటు ఇప్పుడు బాలీవుడ్ లోనూ ఎంట్రీ ఇస్తోంది యంగ్ సెన్సేషన్. హ్యాండ్సమ్ అండ్ రొమాంటిక్ హీరో కార్తీక్ ఆర్యన్ తో కలిసి ఓ లవ్ స్టోరీ లో నటిస్తోంది. అనురాగ్ బసు తెరకెక్కిస్తోన్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన ఓ కార్యక్రమానికి హీరో కార్తీక ఆర్యన్, శ్రీలీల హాజరయ్యారు. అయితే స్టేజ్ దగ్గరకు వెళుతున్న సమయంలో కొందరు ఆకతాయిలు శ్రీలీలను పట్టి లాగేశారు. అయితే సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే స్పందించి నటిని స్టేజ్ దగ్గరకు తీసుకొచ్చారు. అందరూ చూస్తుండగానే అభిమానులు ఇలా చేయడంతో శ్రీలీల షాక్ లో మునిగిపోయింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఈ వీడియో చూసిన శ్రీలీల అభిమానులు బాగా ఫీలవుతున్నారు. మరీ ఇలా ప్రవర్తిస్తున్నారేంట్రా అని ఆకతాయిలపై మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే కార్తీక్ ఆర్యన్ తో శ్రీలీల డేటింగ్ చేస్తోందంటూ కొన్నిరోజుల నుంచి రూమర్స్ వస్తున్నాయి. అందుకు తగ్గట్టుగానే తన కోడలు డాక్టరయితే బాగుంటుందని కార్తీక్ ఆర్యన్ తల్లి ఓ సందర్భంలో చెప్పడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. అయితే ఇవన్నీ సినిమాపై బజ్ క్రియేట్ చేసేందుకేనని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



# అది సరైన పద్ధతి కాదు

ఇటీవల ఓ తమిళ సినిమా ఒప్పుకున్నా. ఆడిషన్‌కి రమ్మంటే వెళ్లా. తీరా ఆడిషన్ అయ్యాక.. ఆ పాత్రకు నా వయసు సరిపోదని, మరీ చిన్నదానిలా ఉన్నానని, నన్ను తిరస్కరించి, నాకంటే పెద్ద వయసుగల నటిని తీసుకున్నారు. సినిమా ఒప్పుకున్న తర్వాత.. పాత్రకు సరిపోలేదని తప్పించే బదులు.. ముందే ఆడిషన్ చేస్తే బావుండేది కదా?..' అంటూ ప్రశ్నించింది టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఇంకా చెబుతూ 'నేను ఎంత పెద్ద స్టార్‌ని అయినా కానివ్వండి. ఆడిషన్‌కి పిలిస్తే వెళతా. అసలు నన్నడిగితే.. పాత్రధారుల్ని ఎంచుకునేముందు ఆడిషన్ చేయడం కరెక్ట్. పాత్రల్లో దమ్ము ఉన్నప్పుడు సదరు ఆర్టిస్ట్‌కి చేయగల సత్తా ఉందా.. లేదా అనేది తెలుసుకునేందుకు ఆడిషన్ అవసరం. అయితే అది అడ్వాన్స్ ఇవ్వకముందే జరగాలి. ఇచ్చాక ఆడిషన్ చేసి తీసేయడం సరైన పద్ధతి కాదు. కథ కూడా చెప్పకుండా, ఫలానా హీరో సినిమా అనేసి, అడ్వాన్స్ ఇచ్చేసి కొందరు వెళ్తుంటారు. అప్పుడే అర్థమైపోతుంది.. ఆ పాత్రలో చేయడానికి ఏమీ ఉండదని. ఆడిషన్‌కి పిలిస్తే.. అది కచ్చితంగా మంచి పాత్రే అయ్యుంటుంది. అందుకే ఎవరు ఆడిషన్‌కి రమ్మన్నా వెళ్లిపోతుంటా. కానీ వాళ్లేమో ఇలా బిహేవ్ చేస్తుంటారు.' అంటూ బాధను వ్యక్తం చేసింది పూజా హెగ్డే.



# తన బ్రేకప్ గురించి తొలిసారి స్పందించిన అషూ రెడ్డి..

## -ఆ కారణం వల్లే విడిపోయాం

జూనియర్ సమంతగా పేరు తెచ్చుకున్న అషూ రెడ్డి ఇప్పుడు తన అందచందాలతో కుర్రకారుని ఎంతగా అట్రాక్ట్ చేస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. యాంకర్, యాక్టర్, టెలివిజన్ ప్రజెంటర్ ఇలా అన్ని విభాగాలలో సత్తా చాటుతుంది. ఇక బిగ్ బాస్ షోలో కూడా పాల్గొని మంచి పేరు తెచ్చుకుంది. విదేశీ టూర్లు, వెకేషన్ ఫోటోలతో సోషల్ మీడియాలో అల్లాడించేస్తుంటారు. అయితే ఈ అమ్మడు తాజాగా తన ప్రేమ, పెళ్లి,బ్రేకప్‌లకి సంబంధించి పలు విషయాలు మాట్లాడింది. తాను ఒక అబ్బాయితో ప్రేమలో ఉన్నప్పుడు హ్యాపీగానే ఉందట. ఇద్దరికీ ఈగో ఇష్యూస్ వలన మా బంధం బ్రేకప్ అయిందని అంటుంది అషూ రెడ్డి.ఇద్దరం కూడా ఎవరికి వాళ్లం నువ్వెంత అంటే నువ్వెంత అన్నట్టు ఉండేవాళ్లం. తను జాబ్ చేసి సంపాదిస్తున్నాడు, నేను సంపాదిస్తున్నాను. అయితే నా విషయంలో అతని ప్రమేయం మరింత ఎక్కువైంది. ఒసారి ఫ్రెండ్స్‌తో బయటకి వెళ్లినప్పుడు అతను కూడా వచ్చాడు. అక్కడ ఓ ఇష్యూ జరిగింది. ఆ రోజు వెళ్లకపోయిన బాగుండేది. ఆ తర్వాత బ్రేకప్ అయింది.డిప్రెషన్‌లోకి వెళ్లాను. డిప్రెషన్ నుంచి బయటపడటానికి కొంత మంది ఫ్రెండ్స్ సపోర్ట్ చేశారు అని తెలిపింది అషూ. ఇప్పుడు ఆ అబ్బాయి మళ్లీ వస్తే తాను యాక్సెప్ట్ చేయనని అంటుంది. ఇక సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌తో చాలా సార్లు హ్యాంగ్ ఔట్ అవుతానని అంటుంది అషూ రెడ్డి.ఒకసారి ఇద్దరం దుబాయ్‌లో హ్యాంగవుట్ అయ్యాం. అయితే నేను వేరుగా వెళ్లాను. ఆయన వేరే పని మీద వచ్చారు. సోషల్ మీడియాలో పోస్టు చేసి.. దుబాయ్‌లో ఉన్నావా అని మెసేజ్ చేశాడు. అవును అని చెప్పడంతో సాయంత్రం కలిసాడు. అప్పుడు రాహుల్‌తో నా రిలేషన్ ఏర్పడంది. రాహుల్ కుటుంబం నాకు ఫ్యామిలీ లాంటింది. మా కుటుంబంతో కూడా వారు చాలా బాగా ఉంటారు. మా బంధం విషయంలో రాహుల్ ఫ్యామిలీ త్వరలో ఓ ప్రకటన అధికారికంగా చేస్తారు. దానిని నేను రీ పోస్టు చేస్తాను. అంతకంటే ఇప్పుడు ఎక్కువగా ఏ విషయాలను వెల్లడించలేను అని అషురెడ్డి చెప్పడంతో త్వరలో రాహుల్, అషూ పెళ్లి చేసుకోబోతారేమో అని ముచ్చటించుకుంటున్నారు

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613